# 17

# తీతు, ఫిలేమోను: సంగతులను క్రమంలో ఉంచుట

### శీర్షికలు

తీతు, దాన్ని పొందినవాని పేరున పిలువబడింది (1:4). తీతు అపొస్తలుల కార్యాల్లో ప్రస్తావింపబడకపోయినా, అతడు విలువైన జతపనివాడని పౌలు ఉత్తరాలనుండి మనకు స్పష్టమవుతుంది (2 కొరింథీయులకు 2:13; 7:6, 13, 14; 8:6, 16, 23; 12:18; గలతీయులకు 2:1, 3; 2 తిమోతి 4:10). తీతు గ్రీసు దేశస్థుడు (గలతీయులకు 2:3), పౌలు అతన్ని కన్వర్ట్ చేశాడు (తీతు 1:4). కఠినమైన పరిస్థితుల్లోనికి పౌలు తీతును పంపుతున్నట్టు ఎల్లప్పుడును కన్పిస్తున్నందున, "పౌలు యొక్క తొందరల వేటగాడని" పిలువబడ్డాడు.

ఫిలేమోను కూడ పొందినవాని పేరునే పిలువబడింది (1 వ.). ఒనేసిము ఈ రచన యొక్క అంశం (10 వ.), అతడు కొలొస్సయినుండి వచ్చినవాడే (కొలొస్సయులకు 4:9). ఫిలేమోను ఆ పట్టణంలో నివసించాడని మనం ఊహించవచ్చు (కొలొస్సయులకు 4:7-9 మరియు ఫిలేమోను 10-12ని పోల్చి చూడు).

### పూర్వ చరిత్ర

పౌలు రోములో మొదటిగా ఖైదులో ఉన్నప్పుడు ఫిలేమోనుకు ఉత్తరం వ్రాయబడింది. ("ఎఫెసీయులకు: క్రీస్తు, ఆయన సంఘము" అనే వ్యాసపు నోట్సును చూడు). వ్యక్తిగతమైన ఈ ఉత్తరం యొక్క ఉద్దేశం: ఇంటనుండి పారిపోయిన బానిసయైన ఒనేసిమునకు, ఫిలేమోనుకును మధ్యగల సంబంధాన్ని "క్రమపరచడం." ఆ ఒనేసిమును రోములో పౌలు కన్వర్ట్ చేశాడు. పౌలు త్వరలో విడుదల పొంద ఎదురు చూచాడు (22 వ. చూడు).

రోములోని తొలి చెరసాలనుండి పౌలు విడుదల పొందినట్టున్నాడు. సువార్త ప్రకటించుతూ తిరిగినా అది అపొస్తలుల కార్య గ్రంథంలో దాఖలు చేయలేదు. ఈ కాలంలో, పౌలును, తీతును కలిసి క్రేతువరకు ప్రయాణం చేసినట్టున్నారు. అక్కడ స్థానిక సంఘంలో లోపంగా ఉన్నవాటిని "దిద్దడానికి" పౌలు తీతును విడిచి వస్తాడు (తీతు 1:5).

మధ్యధరా సముద్రంలో గ్రీసుకు ఆగ్నేయంగా క్రేతు ఒక ద్వీపమైయుంది. మొదటి సువార్త ప్రసంగం చేయబడిననాడు యెరూషలేములో క్రేతునుండి వచ్చిన ప్రతినిధు లున్నారు (అపొస్తలుల కార్యములు 2:11); ఒకవేళ వారిలో కొందరు మార్పునొంది

సువార్తను ఆ చోటుకు తీసికొని వెళ్లియుండవచ్చు కూడా. క్రేతులోని నివాసులు ఫిలిష్తీయుల సంతతివారు. వారు సాహసముగల నావికులు, విలు విద్య నేర్చినవారు. అయితే వారికి "అబద్ధికులు, దుష్ట మృగములు, సోమరులగు తిండిపోతులనే" పేరుంది (తీతు 1:12). సువార్త విత్తనాలు నాటడానికి అది అనువైన భూమి కాదు. కాని దేవుడు సమస్త జనులయెడల అక్కరగలవాడైయున్నాడు (అపొస్తలుల కార్యములు 10:34, 35).

పౌలు తీతుకు వ్రాసినప్పుడు బహుశా అతడు నికొపొలికి వెళ్లుతున్నట్టున్నాడు (తీతు 3:12), అది పశ్చిమ గ్రీసులోని పట్టణమైయుంది; ఒకవేళ అతడు మాసిదోనియగుండా వెళ్లుతున్నాడేమో. లోపముగా ఉన్నవాటిని దిద్దేది ఎలాగో పౌలు తీతుకు తెలుపుతున్నాడు. ఇతర కారణాలను బట్టి కూడ అతడు వ్రాసియుండవచ్చు: (1) తన యెదుటనున్న కష్టమైన పని విషయంలో తీతును ప్రోత్సహించడానికి కావచ్చు. (2) అధికార పూర్వకమైన అపొస్తలుని ఉత్తరం ద్వారా తీతును *బలపరచడానికి* వ్రాసియుండవచ్చు.

క్రేతీయులు అర్థం చేసికోగల అధికారపూర్వకమైన వైఖరిలో తీతు పత్రిక వ్రాయబడింది. ఏదియెలాగున్నా, సభ్యులకు సంబంధించి నిరర్థక భాషణలేవీ లేకపోగా, సువార్తికులందరికి గంభీరమైన ఆదేశాలు కలిగియుంది (తీతు 2:7, 8), క్రొత్త నిబంధన యొక్క రెండు మహా గొప్ప సిద్ధాంతాలు అది కలిగియుంది (తీతు 2:11–14; 3:3–7).

తీతు పౌలును నికొపొలిలో కలిసికొన్న తరువాత, పౌలు అక్కడ బంధింపబడినవాడై రోముకు కొనిపోబడ్డాడని కొందరు తలంచుతారు; తీతు అతనితో కూడ వెళ్లియుండవచ్చు (2 తిమోతి 4:10).

**తీతు పత్రిక యొక్క అవుట్‌లైన్**

I. బలీయమైన నాయకత్వాన్ని ఏర్పాటు చేయడంవలన లోపముగానున్నవాటిని దిద్దుట (1).
   A. బలీయమైన క్రైస్తవ భర్తలను, తండ్రులను ఏరి తీసికోవాలి (5–9 వచనాలు).
   B. అబద్ధ బోధకులను డీల్ చేయగల పురుషులను ఏరి తీసికోవాలి (10–16 వచనాలు; 3:9–11 చూడు).

II. హిత బోధను ఉపదేశించుటచేత సంగతులను క్రమపరచాలి (2; 1, 15 వచనాలను గమనించు).
   A. హిత బోధ ఆజ్ఞాపించబడింది (1, 7, 8, 15 వచనాలు).
   B. అన్ని వయస్సులవారికిని (2–8 వచనాలు), దాసులకును హిత బోధ వర్తింపజేయబడింది (9, 10 వచనాలు).
   C. హిత బోధ వివరించబడింది (11–14 వచనాలు).

III. సత్ క్రియలను ప్రోత్సహించుటవలన సంగతులు క్రమపరచబడ్డాయి

(3; 1, 8, 14 వచనాలు గమనించు).

A. సత్ క్రియల ఆవశ్యకత (1:16; 2:7, 14 చూడు).

1. పౌరులుగా (1, 2 వచనాలు).

2. సువార్తికులుగా (8, 14 వచనాలు).

B. సత్ క్రియల కొరకైన ఉద్దేశం: దేవుని ప్రేమ (3–7 వచనాలు).

**తీతుకు వ్రాసిన పత్రికనుండి పాఠాలు**

క్రేతులో లోపంగా ఉన్న ప్రధానమైన సంగతి *బలీయమైన నాయకత్వం* (1:5). సంఘం ఏమైయుండాలో అదైయుండడానికి మంచి నాయకత్వం అవసరం. తగినంత కాలం సంఘం ఉనికిలో ఉంటూ దానికి పెద్దలు లేకుంటే, దానిలో ఏదో లోపముంది. ("లేఖనానుసారం కాని క్రమంలో ఉండడంకంటె, లేఖనానుసారంగా అన్ ఆర్గనైజ్డ్‌గా ఉండడం మేలు.") సాధ్యమైనంత త్వరలో అవసరమైన యోగ్యతలతో పురుషులు పెంచబడేలా ప్రతివిధమైన ప్రయాస అవసరమైయుంటుంది (1:5–9).

పెద్దలను నియమించే బాధ్యత ఉన్నందున (1:5) తీతుకు (సువార్తికునికి) పెద్దలపై అధికారమున్నట్టు రుజువౌతుందని కొందరు ఉపదేశిస్తున్నారు ("సువార్తికుని అధికారము"). పెద్దలను ఏరుకునేది – సంఘ నాయకులను సంఘమే ఏరుకోవాలని అపొస్తలుల కార్యములు 6:1–6 బోధిస్తుంది. సువార్తికుడు చేసేదంతా, ఆ స్థానంలో వారిని నిలపడమే. రాష్ట్రపతిని తన పదవిలో నిలపడానికి ప్రమాణ స్వీకారం చేయించినవానికి రాష్ట్రపతి మీద ఎలాగు అధికారముండదో ఆలాగే పెద్దలను వారి స్థానంలో నిలబెట్టిన సువార్తికునికి పెద్దలపైని అధికారముండదు.

2:11–14; 3:3–7లను ధ్యానించు. దేవుడు మనకు ఏమి చేశాడో, అది ఈ జీవితాన్ని ఎలా ప్రభావితం చేస్తుందో మనం ఆలోచించాలి.

**ఫిలేమోను అవుట్‌లైన్ మరియు పాఠాలు**

ప్రసంగం అవుట్‌లైన్ చూడు.

## గీతల మధ్య చదవడం (ఫిలేమోను)

పోష్టులో ఉత్తరం వచ్చింది. ఎక్కడనుండి వచ్చిందో అడ్రస్ చూచావు. అది స్నేహితునినుండి వచ్చింది. "నీవెలాగున్నావ్? నేను క్షేమమే" అనే రూపంలో ఉంటుందని కవరును తెరిచావు. దానికి బదులు నీ స్నేహితుడు తన హృదయాన్ని నీ యెదుట కుమ్మరిస్తున్నాడు. ఆ మాటలు నీకు ఆనందం లేక దుఃఖం కలిగించవచ్చు లేక నీకు పిచ్చే పుట్టించవచ్చు. ఉద్వేగంతో నీవు ఉత్తరాన్ని క్రింద జారవిడిచి, నేలవైపు చూడసాగావు. నీ ఉద్వేగాన్ని నీవు అదుపులోనికి తెచ్చుకొని మరల ఆ కాగితాలు పట్టుకొని చదువనారంభించావు. నెమ్మదిగా, జాగ్రత్తగా, మొదట్లో నీవు చూడని సంగతులను యిప్పుడు కనుగొనసాగావు. తిరిగి ఉత్తరాన్ని క్రిందపెట్టావు. అయితే మాటలు నీతో

ఉండిపోయాయి. సందేశంలో ఎక్కువ విషయాలు గుప్తమైయున్నట్టు నీవు నెమ్మదిగా చూచావు.

ఫిలేమోను యొక్క క్లుప్తమైన ఉత్తరం ఆలాటిది. కొలస్సీ సంఘములో ఫిలేమోను ఒక నాయకుడు. అతడు పౌలుచే కన్వర్ట్ చేయబడియుండవచ్చు (19బి వ.); సన్నిహిత స్నేహితునిగా పౌలు అతనికి హెచ్చరికనిచ్చాడు. ఒక రోజున తుకికు ఫిలేమోను గుమ్మము దగ్గర నిలిచి (కొలొస్సయులకు 4:7), "పౌలు యొక్క ఉత్తరం రోమునుండి వచ్చిందని" ఫిలేమోనుతో అన్నట్టు ఊహించు. ఆ ఉత్తరాన్ని అందుకొనడానికి ఫిలేమోను చిరునగవుతో ముందుకు వచ్చాడు. అతడు అలా చేయబోతుండగా తుకికుతో పాటు తనకు కీడు చేసిన ఒకని, మరెన్నడు అతని ముఖాన్ని చూడబోనని తలంచిన ఒనేసిము (కొలొస్సయులకు 4:7-9), తన యింట చోరీ చేసిన బానిస, ఆ రాత్రి పారిపోయినవాడు కన్పించాడు. ఫిలేమోను నగవు మండిపడడానికి మారిపోయి, అతడు మాట్లాడ నోరు తెరిచాడు. "ఒక్క మాట కూడ మాట్లాడవద్దు ఫిలేమోను" అని తుకికు అంటూ పౌలు వద్దనుండి వచ్చిన ఉత్తరం నీవు చదివేవరకు అని హెచ్చరించాడు. గట్టిగా శ్వాసించుతూ, ఫిలేమోను కూర్చుండి చదువనారంభించాడు.

క్రొత్త నిబంధనలో ఈ ఉత్తరం వేరైనది. తొలిసారి చదివినప్పుడు, అది సాధారణమైన వ్యక్తిగత ఉత్తరం. పౌలు జీవించిన కాలంలోని క్షణిక దర్శనంగా ఉండిపోయింది. మనం చదివి, మరల చదివి దాన్ని ఆలోచిస్తుంటే, దానిలో ఏ తరానికైనా సరిపోయే పాఠాలున్నాయి.

I. బానిసత్వము మరియు సాంఘీక సమస్యలు.
   A. ఆనాటి బానిసత్వపు వెలుగులో ఈ ఉత్తరాన్ని చదవాలి.
      1. బానిసయైన ఒనేసిము ఫిలేమోను యొక్క ఆస్తి. పారిపోవడంకంటె ఒక బానిస చేయగల ఘోరమైన నేరం మరొకటి ఉండదు, అందులోనూ దొంగిలించి పారిపోవడం. అత్యంత కఠినమైన శిక్ష విధించగల హక్కును ఫిలేమోను కలిగినవాడైయున్నాడు. (పౌలు ఒనేసిము తప్పును తక్కువ చేయలేదు.)
      2. క్రైస్తవులుగా మనం దేని పక్షంగా నిలిచామో దానికి వ్యతిరేకంగా బానిసత్వం ఉంది. కాని బానిసలకును, యజమానులకును క్రొత్త నిబంధన ప్రత్యేకమైన హెచ్చరికల నిస్తుంది (ఎఫెసీయులకు 6:5-9; కొలొస్సయులకు 3:22-4:1). బానిసత్వాన్ని సంపూర్తిగా మనం చదివే రచన కూడ ఖండించలేదు. ఎందుకో?
         ఎ. ప్రాధాన్యతలు. కొద్ది సంవత్సరాలలో మంటికి మార్చబడే దేహముకంటె మన ఆత్మలు గడిపే నిత్యత్వాన్ని గూర్చి క్రైస్తవ్యం ఎక్కువ అక్కర కలిగియుంది.
         బి. విధానం. ఇది జాగ్రత్తగా చేపట్టవలసిన బగ్గున మండే పరిస్థితి.

(1) క్రైస్తవ విధానం ఎన్నడు విప్లవానికి సంబంధించింది కాదు.
(ఎ) క్రైస్తవులు కాకపోయినా అధికారంలో ఉన్నవారిని మనం గౌరవించాలి (రోమా 13:1నుండి.).
(బి) సమాధానము ఉండునట్లుగా మన నాయకుల కొరకు మనం ప్రార్థించాలి (1 తిమోతి 2:1నుండి.).
(2) హృదయాలను మార్చుతూ జీవితాలను మార్చే క్రైస్తవ సూత్రాలను ఉపదేశించడమే క్రైస్తవ విధానమైయుంది.
(3) ఈ విధానం పని చేసింది. ఎక్కడ క్రైస్తవ సూత్రాలు ఉపదేశింపబడి అభ్యసించబడ్డాయో అక్కడ బానిసత్వపు నిర్మూలన జరిగింది.

B. నేడు మనకు ఈ పాఠం అవసరం. క్రైస్తవులు సాంఘీక దురాచారాలను పట్టించుకోవాలి. అయినా, మన ప్రాథమిక గురి సమాజాన్ని మార్చడం కాదు. ఆత్మలను రక్షించడం. క్రీస్తు సువార్తను, ఆయన దయచేసిన అద్భుతమైన సూత్రాలను నమ్మకంగా ప్రకటించడంతో మనం సాంఘీక సమస్యలను పరిష్కరిస్తున్నాం!

II. సహోదరులు మరియు క్షమాపణ.

A. ఫిలేమోను యొక్క సందిగ్ధాన్ని సంపూర్ణంగా అభినందించడం మనకు కష్టం. ఒనేసిము బహు కఠినమైన శిక్షకు పాత్రుడు. అటు పౌలును బాధించడంగాని, యిటు తన యింటివారి గౌరవాన్ని కోల్పోవడంగాని ఫిలేమోను కోరడం లేదు. ఎవరైనా, ఎప్పుడైనా ఎదుర్కొనేదాని కంటెను యిది బహు యిబ్బందికరమైన “క్షమాపణ సమస్యయై” ఉంది.

1. తన స్నేహితుడైన ఫిలేమోనును మెచ్చుకొంటూ పౌలు అనుకూలమైన విధానంలో ఆరంభించాడు (4–7 వచనాలు).
2. పౌలు అధికారపూర్వకంగా అడగలేదు; అతడు బతిమిలాడాడు (8, 9, 14 వచనాలు).
3. “తన వయస్సును,” “తన బంధకాలను” (9 వ.) తన త్యాగాన్ని మనస్సుకు వచ్చేలా నెమ్మదిగా మాట్లాడి, “నన్ను చేర్చుకొన్నట్టు అతనిని చేర్చుకొనుము” అని పౌలు అడిగాడు (17 వ.).
4. ఒనేసిము చురుకైన సేవ చేసే క్రైస్తవుడైనట్టును (11–13 వచనాలు), ఫిలేమోనుకు ప్రయోజనకరమైనవాడై ఉంటాడని అతడు నొక్కి చెప్పాడు (16 వ.).
5. పదాల మీద ఆట్లాడుతూ “ఒనేసిము” అంటే “ప్రయోజనకరమైన,” “లాభకరమైన” అనే భావాన్ని కనుపరచాడు (11 వ.). గతంలో

"కొంత ప్రయోజనకరమైనవాడు," "దేనికే పనికిరాకుండాపోయాడు"; క్రైస్తవుడుగా అతడు "ప్రయోజనకరమైనవాడుగా" దిద్దబడ్డాడు.

6. జరిగినదానంతటిలో దేవుని హస్తముందని పౌలు గుప్తం చేశాడు (15 వ.).
7. నేరాన్ని చిన్నది చేయకుండానే, కలిగిన నష్టాన్ని తాను చెల్లిస్తానన్నాడు (18, 19ఎ వచనాలు; *18వ వచనం ఈ ఉత్తరానికి కీలక భాగమై ఉంది*).
8. ఫిలేమోను తనకు ఏమి రుణపడియున్నాడో పౌలు గుర్తుచేశాడు (19బి, 20 వచనాలు).
9. ఫిలేమోను తీర్మానంలో తాను నమ్మికను వ్యక్తపరచాడు (21 వ.).

B. సహోదరుల మధ్య పొసగని పరిస్థితి ఏర్పడినప్పుడు సంఘంలో బహు సున్నితమైన పరిస్థితి ఏర్పడింది. ప్రతి ఒక్కడు "క్రైస్తవునిలా మసలుకుంటే" సమస్యలన్నీ పరిష్కరించబడతాయి! ప్రభువునకు మనం ఎంతో రుణపడియున్నందున మనం క్షమించటం నేర్చుకోవాలి, అది కేవలం ఆజ్ఞాపింపబడినందున మాత్రము కాదు (ఎఫెసీయులకు 4:32)!

III. క్రీస్తు మరియు ఆయన సిలువ.

A. పౌలు సలహా యిచ్చింది ఆనాటి సమాజానికి వ్యతిరేకమయ్యింది. తన బానిసను క్షమించమని పౌలు ఫిలేమోనుకు సలహా ఎలా యివ్వగలడు? పౌలు క్రీస్తులో ముంచి తేల్చబడ్డాడు (గలతీయులకు 2:20). పౌలు యిచ్చే సలహా క్రీస్తు మన నిమిత్తం చనిపోయినదానికి సమాంతరమై యుంది.

1. మనం జన్మించినప్పుడు, "కొంత ప్రయోజనకరమైనవారమే"; మనం పాపం చేసినప్పుడు "దేనికి పనికిమాలినవారమయ్యాం." ఒనేసిమువలె, మనం సువార్తను సంధించినప్పుడు, మనం మన స్థితిని ఎరుగుదుము.
2. "నేను ఆ రుణాన్ని తీర్చుతానని" యేసు అన్నారు. "నీవు నన్ను చేర్చుకొన్న ప్రకారం వీనిని నీవు చేర్చుకొనుమని" ఆయన నీ కొరకును, నా కొరకును తన తండ్రితో అన్నారు!
3. తిరిగి మనం దేవునికిని, మానవునికిని "కొంత ప్రయోజనకరమైనవారంగా" మార్చబడ్డాం!

B. ప్రభువైన యేసు పౌలు కొరకు చేసింది అదే. అందువలన ఒనేసిమును గూర్చి ఫిలేమోనుకు సలహా యివ్వడంలో అతడు వెనుకాడలేదు. ప్రభువు మన పట్ల ఏమి జరిగించారో మనం గ్రహించగలిగియుంటే,

ప్రతిదాని విషయంలో మన దృక్పథం మార్చబడుతుంది!

ముగింపు

తీతు, హెబ్రీయులకు మధ్య యిరికించబడిన ఈ చిన్న ఉత్తరంనుండి శక్తివంతమైన పాఠాలను కనుగొనవచ్చు. మనం దీన్ని చదవాలి, మరల చదవాలి, యోచించాలి, ఆ గీతల మధ్య ఉన్న సందేశాన్ని కూడ చదువవలసియుంటుంది.